# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 16-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా ప్రారంభమైంది.
- భారతదేశంలో క్రియేటర్ ఎకానమి వేగంగా విస్తరించడంలో బలమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన జనాభా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.
- రాజస్థాన్‌లోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఈరోజు జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.
- జాతీయ భద్రత, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని సాధించడానికి కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాలు స్వదేశీయంగా అభివృద్ధి చెందాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ఉగ్రవాద సంఘటనలను దర్యాప్తు చేయడంలో ఢిల్లీ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.

========================

ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ న్యూఢిల్లీలోని భారత్ మండపం వేదికగా ఈరోజు ప్రారంభమైంది. ఐదు రోజు పాలు జరిగే ఈ సదస్సులో నిర్వహిస్తున్న పలు సెషన్లలో పాల్గొనేందుకు పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, విధాన నిర్ణేతలు, పరిశోధకులు, సాంకేతిక ఔత్సాహికులు ప్రపంచ నలుమూలల నుండి విచ్చేస్తున్నారు. సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన ఏఐ ఎక్స్‌పోను కొద్ది సేపటి క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. గ్లోబల్ సౌత్ లో నిర్వహిస్తున్న తొలి AI శిఖరాగ్ర సమావేశం ఇది. సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐను రూపొందించేందుకు ఈ వేదికగా పలు దేశాలు ఏకమవుతున్నాయి. "సర్వజన హితాయ - సర్వజన సుఖాయ" అనే నినాదంతో, అందరి సంక్షేమం, మానవ కేంద్రిత అభివృద్ధి లక్ష్యంగా కృత్రిమ మేధను వినియోగించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం.

========================

ప్రజలకు ప్రాధాన్యతనిచ్చే ప్రజాస్వామ్య AI భవిష్యత్‌ను రూపొందించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాలలో ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ ముందంజలో ఉందని ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ అభివర్ణించారు. AI పరిణామ క్రమంలో ప్రజా శ్రేయస్సు, ప్రాప్యత, ప్రపంచ సహకారాన్ని కేంద్రంగా చేయడం ద్వారా గ్లోబల్ నార్త్ సాంకేతిక బలాలను, గ్లోబల్ సౌత్ సామర్థ్యంతో అనుసంధానించడానికి భారత్ ప్రయత్నిస్తుందని సామాజిక మధ్యమం వేదికగా పేర్కొన్నారు. ఈ సమ్మిట్ ప్రపంచ వ్యాప్తంగా భాగస్వామ్య పురోగతిని నడిపిస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు. గత సంవత్సరం పారిస్‌లో జరిగిన AI యాక్షన్ సమ్మిట్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని పునరుద్ఘాటిస్తూ... AI మానవ కేంద్రీకృతంగా ఉండాలని, బాధ్యతతో మార్గనిర్దేశం చేయబడాలని ఆయన స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశంలో క్రియేటర్ ఎకానమి వేగంగా విస్తరించడంలో బలమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన జనాభా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు ఇండియా AI ఇంపాక్ట్ సమ్మిట్ లో భాగంగా నిర్వహించిన ఒక సెషన్‌లో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ... భారతదేశంలో క్రియేటర్ ఎకానమి వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త సాంకేతికతలు, పని విధానాలకు అనుగుణంగా మారుతోందని స్పష్టం చేశారు. ఉద్భవిస్తున్న సాంకేతికతలకు అనుగుణంగా శ్రామిక శక్తిని సిద్ధం చేయడానికి నైపుణ్యాలను పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. వ్యవసాయం, వాతావరణ అంచనా, కొత్త పదార్థాల ఆవిష్కరణ, ఉత్పాదకత వంటి రంగాలలో AI అపారమైన అవకాశాలను అందిస్తోందని చెప్పారు. అయితే.. సాంకేతికత కూడా సంభావ్య ప్రమాదాలను కలిగి ఉంటుందని, అలాగే సానుకూల, ప్రతికూల ప్రభావాలను కలిగి ఉంటుందని అశ్విని వైష్ణవ్ పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఈ రోజు జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడి భారీ పేలుళ్లు సంభవించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ అగ్నిప్రమాదంపై ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందడం విషాధకరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (JEE Main 2026) సెషన్-1 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) కొద్ది సేపటి క్రితం విడుదల చేసి అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. తాజా ఫలితాల్లో దేశవ్యాప్తంగా 12 మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరు సాధించారు. ఈ ఏడాది జనవరి 21, 22, 23, 24, 28వ తేదీల్లో నిర్వహించిన Paper 1 పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13లక్షల 55 వేల 293 మంది దరఖాస్తు చేసుకోగా.. 13 లక్షల 04 వేల 653 మంది హాజరయ్యారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బెంగళూరులోని రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) లోని మిలటరీ గ్యాస్ టర్బైన్ పరిశోధన వ్యవస్థను రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఈరోజు సందర్శించారు. స్వదేశీ సైనిక గ్యాస్ టర్బైన్ ఇంజిన్ అభివృద్ధికి సంబంధించిన

కొనసాగుతున్న ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. అనంతరం శాస్త్రవేత్తలతో మాట్లాడుతూ... ప్రస్తుతం మారుతున్న ప్రపంచ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఏరో ఇంజిన్ సాంకేతికతలో స్వావలంబన సాధించడం ఎంతో కీలకమన్నారు. జాతీయ భద్రత, వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తిని సాధించడానికి కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాలు స్వదేశీయంగా అభివృద్ధి చెందాలన్నారు. ఏరో ఇంజిన్ టెక్నాలజీలో భారతదేశ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి యునైటెడ్ కింగ్‌డమ్‌తో ఉమ్మడి అధ్యయనాలు, ఫ్రాన్స్‌తో ఒప్పందాలు వంటి అంతర్జాతీయ సహకారాలను చేసుకున్నామని రక్షణ మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో కాశ్మీర్ తో సహా ఈశాన్య రాష్ట్రాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో హింస 80 శాతానికి తగ్గిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఢిల్లీ పోలీసుల 79వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా కేంద్రమంత్రి ఈరోజు మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా జరిగిన అనేక ప్రధాన ఉగ్రవాద సంఘటనలను దర్యాప్తు చేయడంతో పాటు.. మాదకద్రవ్యాల సిండికేట్లు, నకిలీ భారత కరెన్సీ రాకెట్లు, సైబర్ నేరాల కేసులను దర్యాప్తు చేయడంలో ఢిల్లీ పోలీసుల ప్రత్యేక విభాగం కీలక పాత్ర పోషించిందన్నారు. గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడు కొత్త నేర చట్టాలను ప్రవేశపెట్టడం సహా అనేక మైలురాళ్ళు సాధించామని పేర్కొన్నారు. దేశ రాజధానిలో పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడానికి ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ ఇంటిగ్రేటెడ్ హెడ్‌క్వార్టర్స్‌కు శంకుస్థాపన చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. ఇది మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి దేశంలోని అత్యంత అధునాతన కేంద్రాలలో ఒకటిగా మారనుందని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 ప్రపంచ కప్-2026లో భాగంగా కొలంబో వేదికగా ఆస్ట్రేలియా, శ్రీలంక జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. బ్యాటింగ్ చేస్తున్న ఆస్ట్రేలియా 18 ఓవర్లకు 6 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. అంతకుముందు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన మ్యాచ్‌లో ఇటలీపై 24 పరుగుల తేడాతో ఇంగ్లాండ్ విజయం సాధించింది. ఈ విజయంతో ఆ జట్టు సూపర్ - 8 కి అర్హత పొందింది. అలాగే ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =